ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: గ్రామీణ మండలం చినగదిలిలో ఉన్న ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా మంగళవారం సాయంత్రం గోదాములను సందర్శించిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ అధికారులకు, భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పర్యటనలో భాగంగా విజిటింగ్ రిజిస్టర్లో సంతకం చేశారు. స్థానిక రెవెన్యూ, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు శ్రీ లక్ష్మీ నర్సయమ్మ నగర్, ఇండియన్ స్ప్రింగ్ స్కూల్ ఏరియాలో జీవీఎంసీ నిధులు సుమారుగా 47.72 లక్షలతో జరుగుతున్న నూతన తారురోడ్డు నిర్మాణ పనులను పెందుర్తి బీజేపీ నాయకులు, స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు మంగళవారం పరిశీలించారు. కాంట్రాక్టర్ అధికారులతో మాట్లాడి నిర్మాణం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి పనులు వార్డులో ముమ్మరంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో బిజెపి 95, 97వ వార్డుల సోషల్ మీడియా కన్వీనర్ కంచిబోయిన వెంకట సంతోష్, అయిత శివ, కోలని ప్రతినిధులు అత్తిలి నాగేంద్ర కుమార్, సుంకరి సన్యాసిరావు, రాజు, సూర్యారావు, లత, రాఘవేంద్రరావు, శంకరరావు, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు కొమ్మాన సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

విజయశ్రీ బ్లడ్ సెంటర్ సీజ్

కార్యకలాపాలు నిలిపివేత

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరంలో రక్తదాన కేంద్రాలు రక్త పీడిత కేంద్రాలుగా మారిపోతున్నాయి. కార్పొరేట్ ఆసుపత్రులకు రక్తం సరఫరా పేరుతో బ్లడ్ బ్యాంకులు చేస్తున్న అక్రమాలకు అడ్డుకట్టు లేకుండా పోతుంది. నగరంలోని మహారాణి పేటలో విజయశ్రీ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎం/ఎస్ విజయశ్రీ బ్లడ్ సెంటర్ లైసెన్స్‌ను సస్పెండ్ చేసి, బ్లడ్ బ్యాంక్‌ను తాము సీజ్ చేసినట్టు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు తాము జరిపిన ఆకస్మిక తనిఖీలలో ఇక్కడ తీవ్రమైన నాణ్యతా ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చాయన్నారు. అర్హత లేని సిబ్బందితో పని చేయిస్తూ, సరైన వైద్య అధికారుల పర్యవేక్షణ లేకుండా రక్త సేకరణ చేస్తున్నారని, సరైన నాణ్యత ప్రమాణాలు కూడా పాటించడం లేదని తాము గమనించామన్నారు. సంబంధిత అధికారుల నివేదిక ఆధారంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ లైసెన్సింగ్ అథారిటీ ఎం.పాండురంగ ప్రసాద్ ఆదేశాల మేరకు తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా బ్లడ్ సెంటర్ యొక్క అన్ని కార్యకలాపాలను తక్షణమే నిలిపివేసున్నామన్నారు. రక్త సేకరణలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే రక్త మార్పిడి సమయంలో రియాక్షన్స్ వచ్చి, ప్రాణాంతకం కావొచ్చన్నారు. అర్హత కలిగిన వైద్య అధికారులు, సిబ్బంది సమక్షంలో మాత్రమే బ్లడ్ బ్యాంక్ కార్యకలాపాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించాలని ఉల్లంఘించే లైసెన్సుదారులపై ఈ విధంగానే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అయితే నగరంలో అనేక బ్లడ్ బ్యాంకుల్లో అక్రమాలు ఉన్నప్పటికీ అధికారులు వాటి జోలికి వెళ్లడం లేదన్న ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి.

వేములవలస జంక్షన్‌లో రద్దీని తగ్గించండి: కలెక్టర్

విశాలాంధ్ర - ఆనందపురం: నిత్యం రద్దీగా ఉండే ఆనందపురం సర్కిల్ ప్రధాన రహదారి ఒకటి, ప్రమాదాలు ప్రజలు ఇబ్బందులు వేరొక ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. ఆనందపురం మండలం ,వేములవలస జంక్షన్ వద్ద మంగళవారం ఉదయం విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆకస్మిక పరిశీలనలు నిర్వహించారు. మహాత్మా గాంధీ పూల మార్కెట్ పరిసరాల్లో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు నెలకొన్న నేపథ్యంలో అధికారులు పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. రోడ్డుపైనే జరుగుతున్న క్రయవిక్రయాల కారణంగా వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, మార్కెట్ రద్దీ రోజురోజుకి పెరుగుతోందని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖపట్నం నుండి ఆనందపురం బ్రిడ్జి క్రింద రహదారి గుండా విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే వాహనాల సంఖ్య పెరగడం కూడా ట్రాఫిక్ భారానికి కారణమవడంతో, మార్కెట్‌కు ఆనుకుని ఉన్న మరో మార్కెట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలని సూచించారు. రోడ్డుపై ఏర్పాటు చేసుకున్న షాపులు, స్టాళ్లను తొలగిస్తే రద్దీ కొంతవరకు తగ్గుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటు అవసరమని సూచిస్తూ, స్థానిక తాసిల్దార్ శ్రీనుబాబు ను వివరణ కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ విభాగం అధికారులు, పంచాయతీ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల యాజమాన్యం నిబంధనలు పాటించాలి

గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ కే.సురేష్ కుమార్

విశాలాంధ్ర - సింహాచలం: గోపాలపట్నం పరిధిలోని ప్రైవేట్ స్కూల్ బస్‌లను గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ కే.సురేష్ కుమార్, ఆర్టిఏ ఇన్స్పెక్టర్ కె.రాజారావు తనిఖీలు నిర్వహించారు. బాలాజీ, మినర్వా స్కూల్ బస్ లకు ఫిట్‌నెస్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్సు, వాహన బీమా తదితర రికార్డులను పరిశీలించారు. సురేష్ కుమార్ మాట్లాడుతూ బస్‌లను నడిపే సమయంలో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని తెలిపారు. అన్ని విద్యా సంస్థల బస్సులు ఫిట్‌నెస్ లేకుండా నడపరాదని, డ్రైవింగ్ లైసెన్సు లేని వ్యక్తులు స్కూలు బస్సులు నడపరాదని అన్నారు. అటువంటి వారిని యజమాన్యాలు అనుమతించకూడదని, విద్యార్థులను సురక్షితంగా తీసుకువెళ్లాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఆర్టీఏ అధికారులు, గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ సూరిబాబు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

భారత్ - దక్షిణాఫ్రికా మ్యాచ్‌ల ఏర్పాట్లపై సమీక్ష

విశాలాంధ్ర - పీయం పాలెం: డిసెంబర్ 6వ తేదీన విశాఖ వేదికగా జరగనున్న భారత్-దక్షిణాఫ్రికా పురుషుల వన్డే మ్యాచ్‌ను విజయవంతం చేయడానికి చేపడుతున్న ఏర్పాట్లపై మంగళవారం సాయంత్రం విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ మైదానంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంద్ర ప్రసాద్, నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో మ్యాచ్‌కు సంబంధించిన భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, మైదానం నిర్వహణ, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి కీలక అంశాలపై అధికారులు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ప్రత్యేకించి ప్రవేశ ద్వారాల వద్ద రద్దీని నియంత్రించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రతను నిర్ధారించడానికి పార్కింగ్ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని సమర్థవంతమైన కమ్యూనికేషన్ కోసం అప్ గ్రేట్ చేయబడిన కేంద్రీకృత పబ్లిక్ అడ్రెస్సింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు క్రికెట్ జట్లు వారి బృందాల భద్రత కోసం ప్రత్యేకంగా పోలీస్ అధికారులను నియమించడం జరిగిందని ఆయన అన్నారు. అనంతరం జివిఎంసీ కమిషనర్ కెతన్ గార్గ్ మాట్లాడుతూ ఈ మ్యాచ్ జీరో వెస్ట్ మేనేజ్మెంట్ తో మ్యాచ్‌ను నిర్వహించడానికి ఏసీఏతో కలిసి సన్నాహాలు చేస్తున్నామని పారిశుద్ధ సమస్యలు ఎక్కడ తలెత్తకుండా సిబ్బందిని ఏర్పాటు చేయనున్నామని స్టేడియంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో త్రాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కౌన్సిలర్ విష్ణు దొంతు, ఎసిఏ స్టేడియం చైర్మన్ ప్రశాంత్, విశాఖపట్నం డిసిపి - 1 సిహెచ్ మణికంఠ, డిసిపి డి.మేరీ ప్రశాంతి, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్, ఫైర్ డిపార్ట్మెంట్, ఎపిఈపిడిసిఎల్ విభాగం అధికారులతోపాటు ఎసిఎ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు సన్ స్కూల్ విద్యార్థులు

విశాలాంధ్ర - భీమిలి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూల్ నడుపూరులో విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి 14 సంవత్సరాలలోపు బాల బాలికలకు నిర్వహించిన నెట్ బాల్ పోటీలలో కే.సాహిల్(8వ), బి.మోక్ష శ్రీ(8వ) సన్ స్కూల్ నుండి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తేది.27.11.2025 నుండి తేది.29.11.2025 వరకు జిల్లా పరిషత్ హైస్కూల్, శృంగవృక్షం పాలకోడేరు, వెస్ట్ గోదావరిలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనడం జరుగుతుందని తెలియజేస్తూ, విద్యార్థులను సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

మార్పు కోసం ముందడుగు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండల సమాఖ్య గ్రామ సంఘం నందు నయి చేతన్ జెండర్ క్యాంపస్ కార్యక్రమం నిర్వహించారు. మార్పు కోసం ముందడుగు అనే ముఖ్యాంశంతో అన్ని డిపార్ట్మెంట్ల సమన్వయం మహిళా సాధికారిక మహిళల పట్ల వివక్షత తొలగింపుపై అందరికీ అవగాహన కల్పించాలని ఉద్దేశంతో నాలుగు వారాలు ఒక్కొక్క థీమ్‌తో మార్పు కోసం ముందడుగు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల సమైక్య నందు గ్రామ సంఘం ప్రెసిడెంట్, కార్యదర్శులు, పోస్టర్ల ర్యాలీతో అవగాహన కల్పించారు. వెలుగు సిబ్బంది గ్రామస్థాయి వివోలు పాల్గొన్నారు.

అంధబాలలకు ఆసరా

బ్రెయిలీ లెర్నింగ్ అసిస్టెంట్ పరికరాన్ని అభివృద్ధి చేసిన గీతం అధ్యాపకుడు

విశాలాంధ్ర - మధురవాడ: బ్రెయిలీ నేర్చుకోవడం దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు చాలా ముఖ్యం, కానీ సాధారణంగా బ్రెయిలీ బోధనకు అధ్యాపకుల నుండి ఎక్కువ సమయం, వ్యక్తిగత దృష్టి అవసరమవుతుంది. ముఖ్యంగా ప్రాథమిక విద్యాభ్యాసం చేసే బాలలలో అన్నివేళలా అధ్యాపకులు దగ్గరే ఉండి బోధన చేయడం సాధ్యపడదు. ప్రత్యేక పాఠశాలలు లేని ప్రాంతాలలో చదువుకోవాలన్న చిన్నారులకు మరీకష్టం. ఈ సమస్యను పరిష్కరించేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఇఇసిఇ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ మహమ్మద్ ఖ్వాజా ముఇన్‌ద్దీన్ చిష్టి బ్రెయిలీ లెర్నింగ్ అసిస్టెంట్ పేరిట సరికొత్త పరికరాన్ని అభివృద్ధి చేశారు. కంటి చూపు లేని బాలలకు గురువు సహాయం లేకుండానే స్వయంగా బ్రెయిలీ నేర్చుకునేలా పరికరాన్ని అభివృద్ధి చేశారు. ఈ ఆవిష్కరణాత్మక లెర్నింగ్ అసిస్టెంట్ ఎంబాడిడ్ కిట్ బ్రెయిలీ విద్యను ఇంటి వద్ద ఉంటూ మరింత సులభంగా నేర్చుకోవచ్చునని డాక్టర్ చిష్టి వెల్లడించారు. ఈ పరికరం తయారీలో తనకు డాక్టర్ చిష్టి గతంలో కూడా అంధుల కోసం వాకింగ్ అసిస్టెంట్ వంటి పరికరాలను రూపొందించారు. తన పరిశోధనకు టి.సూర్య స్వరూప్, మహ్మద్ ఎహసాన్, మహ్మద్ సమీమ్ సుల్తానా ఎంతో సహకరించారని డాక్టర్ చిష్టి తెలిపారు.

బాలిక ఆచూకీ లభ్యం

గంటల వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు

విశాలాంధ్ర - పద్మనాభం: సోమవారం రాత్రిబాలిక ఆచూకీపై భీమిలి పట్నం పోలీస్ వారు కేసు నమోదు చేసిన కొన్ని గంటల వ్యవధిలోని బాలిక ఆచూకీని కనిపెట్టి తల్లిదండ్రులుకు అప్పచెప్పారు. భీమిలి పట్నం మూడో వార్డు గొల్ల వీధి ప్రాంతానికి చెందిన కోన రమేష్ భార్య ఇందిర దంపతులకు కుమార్తె చరిష్మా (13), కుమారుడు ఇద్దరూ పిల్లల కలరు. కోన రమేష్ పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కుమార్తె కోన చరిష్మా సోమవారం ఉదయం నుంచి కనిపించకపోవడంతో సోమవారం రాత్రి కోన రమేష్ ఇందిర దంపతులు భీమిలి పట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సిఐ బి తిరుపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. బాలిక నగరంలో ఓ ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం తెలుసుకొని సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని బాలిక ఆచూకీ కనిపెట్టి చరిష్మా ను తల్లిదండ్రులకు అప్ప చెప్పడం జరిగింది. గంటల వ్యవధిలోని ఈ కేసును ఛేదించిన సీఐ తిరుపతిరావు, అతని బృందానికి కోన రమేష్ దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్ఐ భరత్ కుమార్ రాజు, కానిస్టేబుల్ శ్రీదేవి సమక్షంలో బాలికను తల్లిదండ్రులకు అప్పచెప్పినట్లు పోలీసులు తెలియజేశారు.

భాస్కర్ విద్యా నికేతన్‌లో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: 70వ వార్డు చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్ పాఠశాలలో తల్లిదండ్రులు, పరిసర ప్రాంత ప్రజల కోసం ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరం జరిగింది. ప్రముఖ ఫార్మా కంపెనీ వైద్య బృందం ఆధ్యర్యంలో నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, హెచబీ, ఆర్ బి యస్,బియమ్ఐ, ఫ్యాట్, బోన్ డెన్సిటీ, న్యూట్రిషన్ మొదలైన టెస్టులు పూర్తి ఉచితంగా చేశారు. ఈ వైద్య శిబిరం డా. రాధిక కిరణ్, న్యూట్రిషనిస్ట్ మాధురి, కోఆర్డినేటర్ సరోజినీ, లీఫ్ ఫార్మా సిబ్బంది భాగ్యలత, వి.నాయుడు, సన్యాసినాయుడు, సోమేశ్వరి, లక్ష్మణ్ తదితరులు నిర్వహించగా పాఠశాల తల్లిదండ్రులు, పంతులు గారిమేడ, చట్టివానిపాలెం, దశమ కొండకాలనీ, డ్రైవర్స్ కాలనీ ప్రాంత ప్రజలు పాల్గొని వివిధ రకాలు వైద్య పరీక్షలు ఉచితంగా చేయించుకున్నారు. 200 మంది వైద్య పరీక్షలు నిర్వహించుకున్నట్టు పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కర్ రావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది అనూష, సునీత తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 మెన్స్ మల్టీ డేస్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు విజయం

విశాలాంధ్ర - పియం పాలెం: బోర్డు ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బిసిసిఐ) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో అండర్-19 మెన్స్ మల్టీ డేస్ మ్యాచ్‌లో భాగంగా అనంతపురం ఆర్.టి.డి గ్రౌండ్స్‌లో ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు విజయం సాధించింది. మంగళవారం జరిగిన మ్యాచ్లో మొదట బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 282 పరుగులు చేసింది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో సి.లోహిత్ లక్ష్మీనారాయణ సెంచరీ సాధించి 101 పరుగులతో ఆకట్టుకున్నాడు. మొదటి ఇన్నింగ్ ప్రారంభించిన ఒరిస్సా జట్టు 120 పరుగులకు ఆల్ అవుట్ అయింది. రెండో ఇన్నింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 215 పరుగులు చేసింది. ఈ ఇన్నింగ్స్‌లో కె.వీరారెడ్డి 77 పరుగులు చేశారు. తర్వాత ఇన్నింగ్ ప్రారంభించిన ఒరిస్సా జట్టు 120 పరుగులకు ఆల్ అవుట్ అయింది. రెండవ ఇన్నింగ్స్‌లో ఎన్.రాజేష్ 6 వికెట్లు తీసి ఆకట్టుకున్నారు. ఈ మ్యాచ్లో ఆంధ్రప్రదేశ్ జట్టు ఒడిశా జట్టుపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. మూడు రోజుల్లో మ్యాచ్ ముగిసింది.

సీపీఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - తగరపువలస: దేశ స్వాతంత్రోద్యమం మొదలు బడుగు బలహీన వర్గాలు, పేద, మధ్యతరగతి ప్రజానీకం కోసం 1925 డిసెంబరు 26న మన దేశంలో ఏర్పడ్డ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అని పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు తెలిపారు. సీపీఐ భీమిలి ఏరియా పార్టీ సభ్యుల సమావేశం తగరపువలస సిపిఐ కార్యాలయం జిఆర్ భవనంలో మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న పైడిరాజు మాట్లాడుతూ దేశంలోని సామాజిక, సాంస్కృతిక రంగాల్లో మార్పుల కోసం ఉద్యమిస్తోందని, అంటరానితనం, కుల, మత వివక్ష వంటి వాటికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం నింపుతూ బాల్య వివాహాలు, సతీసహగమనం లాంటి అనేక దురాచారాలను నిర్మూలించడంలో క్రియాశీలకంగా వ్యవహరించిందన్నారు. డిసెంబరు నెలలో నిర్వహించే పార్టీ శత వార్షికోత్సవాలలో ప్రజలు పాల్గొన్న జయప్రదం చెయ్యాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎండి బేగం, ఏరియా పార్టీ కార్యదర్శి కానూరి రాంబాబు, మాజీ కౌన్సిలర్లు చిల్ల నరసింహులు, మావూరి సన్యాసమ్మ, కొండపు ఈశ్వరరావు, మోర అప్పలరాజు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను బెదిరిస్తున్నారు...

'తృప్తి క్యాంటీన్' నిర్వాహకులు ఆవేదన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పేద మహిళలమైన తాము చిరు వ్యాపారం చేసుకుంటే కక్ష కట్టి తమపై వేధింపులకు దిగుతున్నారని ఇకపై వారి ఆగడాలను ఊరుకునేది లేదని పలువురు మహిళలు హెచ్చరించారు. పేదలమైన తాము వ్యాపారం చేసుకోకూడదనే ఉద్దేశ్యంతో అనేకమంది ప్రతిరోజు వచ్చి తమను బెదిరిస్తున్నారంటూ బీచ్‌రోడ్డులో ఉన్న 'తృప్తి క్యాంటీన్' నిర్వాహకులు మీడియా ఎదుట మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అనుమతితో 'సారా' అనే సంస్థ పర్యవేక్షణలో పోలవరపు వరలక్ష్మి, దొడ్డి పైడిరత్న, చేపల నందిని, డి.ధనలక్ష్మి అనే స్వయం సహాయక సంఘాల సభ్యులు ఇటీవల రూ.15లక్షల ఖర్చుతో క్యాంటీన్ పెట్టుకున్న విషయం తెలిసిందే. తమ కుటుంబాలను స్వయం ఉపాధితో జీవనం సాగిస్తుంటే కార్పొరేటర్ సాధిక్ వంటి వ్యక్తులు తమపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని వరలక్ష్మి తదితరులు ఆరోపించారు. దొంగలంటూ ముద్రిస్తున్నారని, వారెవరో తేలాలని, సాధిక్ చేస్తున్నదంతా తమకు తెలుసునన్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా ఈ క్యాంటీన్‌లో దందా అంటున్నారని, తొలుత కొన్నాళ్లు నెట్ సరిగా పని చేయక, క్యూఆర్ కోడ్ లేక, కరెంట్ పోయిన సమయంలో బిల్లు చెల్లించి, తమను కొంతమంది ఇబ్బంది పెట్టేందుకు చూశారని ఆరోపించారు. బీచ్‌రోడ్డులోని కొంతమంది యూనియన్ నేతలొచ్చి ఇక్కడి మెనూ మార్చేయాలంటూ, కొన్ని సరకులు అమ్మొద్దంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరి పేరిటో తాము రుణాలు తీసుకోలేదని, తమకెవరూ కొమ్ము కాయడం లేదని స్పష్టం చేశారు. తమను ఇబ్బంది పెట్టాలని చూడడం సబబు కాదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే తాము క్యాంటీన్‌ను నిర్వహించుకుంటున్నామని నిర్వాహకులు తెలిపారు. తమను ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకునేది లేదని మహిళలు హెచ్చరించారు.

రూ.460 కోట్లు బకాయి బిల్లులు చెల్లించండి

అభివృద్ధి పేరుతో పనులు చేయించుకుని అప్పుల్లోకి నెట్టేశారు జీవీఎంసీ కాంట్రాక్టర్ల ఆవేదన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ కాంట్రాక్టర్లకు 13 నెలలగా బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని, అప్పుల బాధతో అనేకమంది ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిలో ఉన్నారని తమ బాధను అర్థం చేసుకోవాలని కోరుతూ జీవీఎంసీ కాంట్రాక్టర్లు కన్నీరు మున్నీరై విలపించారు. మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల జీవీఎంసీ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పివి నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.సంజీవరెడ్డితోపాటు కార్యవర్గ సభ్యులు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. 13 నెలలగా జీవీఎంసీలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు జరగడంలేదని, రూ 460 కోట్లు బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబర్ 75 ద్వారా తమకు మేలు జరుగుతుందని భావించామని, ఎక్కడ నిధులు అక్కడే వాడుకోవాలని చెప్పినప్పటికీ, జీవీఎంసీలో అధికంగా ఆదాయం వస్తున్నప్పటికీ జీవీఎంసీ ఆదాయం రాష్ట్ర ఖజానాకు వెళ్లిపోవడంతో తమ బిల్లులు చెల్లింపు కష్టతరంగా మారిందని కాంట్రాక్టర్లు అంతా ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నిర్వహించిన సిఐఐ సమ్మిట్ కాంట్రాక్టర్లు దాదాపు 50 కోట్లకు పైగా ఖర్చు చేశారని, త్వరలో నిర్వహించ బోతున్న ఐఎఫ్ఆర్ వంటి పనులకు ముందుకు వెళ్లాలంటే తమకు బకాయి బిల్లులు కనీసం ఆరు నెలలైనా కాంట్రాక్టర్లకు చెల్లించాలని లేదంటే పనులు ఇక నిర్వహించలేమని చేతులెత్తేశారన్నారు. అనేకసార్లు జివిఎంసి కమిషనర్ కు పాలకవర్గ సభ్యులకు, ఎమ్మెల్యేలకు విన్నవించుకున్నామని, ఆందోళనలు చేసిన మీడియా ముఖంగా తమ బాధను తెలియజేసిన రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని కాంట్రాక్టర్లు మండిపడ్డారు. ఆర్థికంగా తీవ్రంగా చితికిపోయామని, ఇక పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు. నిధి పోర్టర్ వల్ల బిల్లులు చెల్లింపుల్లో ఆలస్యం జరుగుతున్నాయని, నిధి పోర్టర్ తమ పాలిట శాపంగా మారిందని తెలియజేశారు.

జీవీఎంసీకి కోట్లాది రూపాయలు ప్రజలు పన్నుల ద్వారా ఆదాయాన్ని సమకూరు స్తున్నారని, అభివృద్ధి పనులు చేస్తున్నప్పటికీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా, సంవత్సరాలు తరబడి కాలయాపన చేయడం వల్ల తాము ఆర్థికంగా తీవ్ర అప్పుల పాలవుతున్నామని తెలియజేశారు. తక్షణం కనీసం 6 నెలల బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించాలని లేదంటే ఎలాంటి పనులు చేయలేమని సమ్మె చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ మద్దాల రమేష్, ఉపాధ్యక్షులు జి.సింహాచలం, కార్యవర్గ సభ్యులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

రాజమౌళి వ్యక్తిగత విశ్వాసం ఆయన స్వతంత్ర హక్కు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాజమౌళి వ్యక్తిగత విశ్వాసం ఆయన స్వతంత్ర హక్కని, భక్తి, నమ్మకం అన్నవి వ్యక్తిగత అంశాలని బిజెపి నేత నీరుకొండ వీరన్న చౌదరి అన్నారు.ఆయన దేవుడిని నమ్మినా, నమ్మకపోయినా- అది ఆయన భారతీయ సినిమాకు చేసిన అసాధారణ సేవలను ఏమాత్రం తగ్గించదని తెలిపారు. సంస్కృతి, చరిత్ర, పురాణ గాథలను ప్రపంచానికి చేరవేసిన విజినరీ దర్శకుడిని, వ్యక్తిగత అభిప్రాయంపై వివాదం సృష్టించడం అనవసరం అని అభిప్రాయపడ్డారు. ఆయన సృజనాత్మకతను, కృషిని గౌరవించడం అవసరమని వీరన్న చౌదరి తెలిపారు.

దేశీయ కార్లకి ఇక్కడ తుప్పు రక్షణ కల్పించే చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఎగుమతి మార్కెట్లకు తయారు చేసే కార్లకు తుప్పు నిరోధక రక్షణ బలంగా ఉండగా, దేశీయ మార్కెట్‌లో అమ్మే కార్లకు అది చాలా తక్కువగా ఉందని ఇండియా లీడ్ జింక్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ (ఐఎల్ జెడ్డీఏ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్. పుగజ్‌హెంథి అన్నారు. ఈ విషయంలో భారత ఆటోమొబైల్ పరిశ్రమ విమర్శలు ఎదుర్కొంటుందన్నారు. యూరప్, జపాన్, ఉత్తర అమెరికా, ఆఫ్రికాకు పంపే కార్లలో 70 శాతం పైగా గాల్వనైజ్డ్ స్టీల్ వాడుతూ, 6 నుంచి12 సంవత్సరాల తుప్పు నిరోధక వారంటీ ఇస్తారు. కానీ భారత మార్కెట్‌లో అమ్మే ఎక్కువ కార్లలో గాల్వనైజేషన్ తక్కువగా ఉండి, తుప్పు వారంటీ దాదాపు ఉండదు. ఈ తేడా వినియోగదారుల హక్కులు, వాహన భద్రత, అలాగే తుప్పు వల్ల భారతదేశానికి కలిగే భారీ ఆర్థిక నష్టంపై ఆందోళనలను రేపుతోంది. అధ్యయనాల ప్రకారం, తుప్పు కారణంగా దేశానికి ప్రతి సంవత్సరం జిడిపిలో దాదాపు శాతం అంటే యూ ఎస్ 100 బిలియన్ డాలర్ల పైగా నష్టం జరుగుతోంది. ఇది వాహనాలు, మౌలిక సదుపాయాలు, పరిశ్రమల వ్యవస్థలపై ప్రభావం చూపుతోంది. సాధారణ కార్ యజమానులకి ఇది పెరుగుతున్న రిపేర్ ఖర్చులు, వేగంగా కూలిపోతున్న నిర్మాణం, అలాగే కొన్ని వర్షాకాలాల్లోనే తగ్గిపోతున్న రీసేల్ విలువ రూపంలో కనిపిస్తోంది. నిపుణుల ప్రకారం, వాహనాన్ని గాల్వనైజ్ చేయడం మొత్తం ఖర్చులో 0.1 శాతం కన్నా తక్కువే పెంచుతుంది. కానీ ఇది యజమానులకు వేల రూపాయల రిపేర్ ఖర్చులను తప్పించగలదు.

కృష్ణాపురంలో దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలంలో కృష్ణాపురం గ్రామంలో ఆలయ ధర్మకర్త మొకర అప్పలనాయుడు (అన్నమయ్య) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దుర్గమ్మ తల్లి 15వ వార్షికోత్సవ వేడుకలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు

విశేషంగా వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా విఘ్నేశ్వర పూజ, కుంకుమ పూజ, మండపారాధన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భారీగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి సుమారు 2500 మంది భక్తులు వచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ ధర్మకర్త మొకర అప్పలనాయుడు (అన్నమయ్య) తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి మాజీ మండలాధ్యక్షుడు కాళ్ల నగేష్ కుమార్ హాజరైనారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో టిడిపి మండల ఒకటవ క్లస్టర్ ఇన్చార్జి కే రామరాజు, పాండ్రంగి పిఏసిఎస్ చైర్మన్ బి సత్య శ్రీనివాసరావు, బిజెపి సభ్యులు హంస మహేష్, కృష్ణాపురం గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం

పర్యావరణ వేత్త బొలిశెట్టి సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ఇకపై పని చేస్తానని, జలబిరాదరి నేషనల్ కన్వీనర్, జనసేన పార్టీ జనరల్ సెక్రటరీ, పర్యావరణ కార్యకర్త బొలిశెట్టి సత్యనారాయణ తెలిపారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన భార్య నాగమణి ఇటీవల మరణించిన నేపథ్యంలో ఆయన తన జీవితాన్ని పర్యావరణ పరిరక్షణ, రాజ్యాంగ పరిరక్షణ వంటి ముఖ్యమైన ప్రజాహిత కార్యాలకు అంకితం చేయాలని నిర్ణయించుకున్నా నన్నారు. తన భార్య నాగమణి మరణం, రాబోయే తరాల భవిష్యత్తు కోసం మరింత కృషి చేయాలనే నా సంకల్పాన్ని మరింత బలపరిచిందన్నారు. ప్రపంచం పర్యావరణ పరిరక్షణ అత్యవసరతను గుర్తిస్తున్నా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఉన్న కాలుష్య నియంత్రణ బోర్డులు తమ బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఐక్యరాజ్య సమితి కూడా కేవలం ఈవెంట్స్‌తో కాలం వెలిబుచ్చుతుందన్నారు. పర్యావరణ పునరుద్ధరణ

కేవలం ప్రభుత్వాల వల్ల మాత్రమే సాధ్యం కాదని, నిజమైన మార్పు ప్రతి గ్రామం, ప్రతి పంచాయతీ, ప్రతి వార్డు మరియు స్థానిక సంస్థల స్థాయిలో ప్రజలు రాజకీయ ప్రయోజనాలకతీతంగా, తమ ప్రాంతపు పర్యావరణ పర్యావరణ సమతుల్యత కోసం స్వచ్ఛందంగా ముందుకు రావాలనే దాంట్లోనే ఉందని అన్నారు. వాటర్‌మ్యాన్ డాక్టర్ రాజేంద్ర సింగ్, పీపుల్స్ జడ్జ్ జస్టిస్ గోపాల గౌడ, ఎం.వి.ఆర్.శాస్త్రి, ఈ.ఏ.ఎస్.శర్మ వంటి ప్రముఖుల మార్గదర్శనం ప్రేరణతో, ఆయన పర్యావరణ పరిరక్షణ, మానవ హక్కుల రక్షణ, భారత రాజ్యాంగం సంరక్షణ అనే మూడు ముఖ్య లక్ష్యాలకు తన జీవితాన్ని అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజేంద్ర సింగ్, జస్టిస్ గోపాల గౌడ తదితరులు మాట్లాడారు.

ఎస్ఈసీఐ ప్రాజెక్టును చేపట్టిన హిందుస్థాన్ పవర్

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంలోని ప్రముఖ ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ కంపెనీలలో ఒకటైన హిందూస్థాన్ పవర్, 150 మెగావాట్ల సౌర విద్యుత్ కాంట్రాక్ట్ సామర్థ్యంతో సౌర మరియు బ్యాటరీ శక్తి నిల్వ ప్రాజెక్టును అభివృద్ధి చేయడానికి సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నుండి బిడ్‌ను గెలుచుకుంది. ఈ ప్రాజెక్టుకు సుమారుగా 300 ఎండబ్ల్యూపి సౌర సామర్థ్యం మరియు 300 ఎండబ్ల్యూహెచ్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ వ్యవస్థాపన అవసరం. భారతదేశం యొక్క క్లీన్ ఎనర్జీ వృద్ధి యొక్క తదుపరి దశను రూపొందిస్తూ, చైర్మన్ రతుల్ పూరి, దేశం యొక్క భవిష్యత్తు విద్యుత్ మౌలిక సదుపాయాలను నిర్వచించే సౌకర్యవంతమైన, నిల్వ-ఆధారిత పునరుత్పాదక ఆస్తులను నిర్మించడంపై కంపెనీ దృష్టిని నొక్కి చెప్పారు. ప్రాజెక్ట్ టెండర్ కింద అభివృద్ధి చేయబడుతుంది. ఇది సౌకర్యవంతమైన విస్తరణ కోసం రూపొందించబడింది మరియు భారతదేశం అంతటా అనువైన ప్రదేశాలలో సెటప్ చేయబడుతుంది. ఇది సుంకం ఆధారిత పోటీ బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా సురక్షితం చేయబడింది, తర్వాత ఈ టీ ఎస్ పోర్టల్‌లో నిర్వహించబడిన విజయవంతమైన ఇ-రివర్స్ వేలం . ఇది ఇంటిగ్రేటెడ్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ తో ఐ ఎస్ టి ఎస్ కనెక్ట్ చేయబడిన సోలార్ పీ వీ ప్రాజెక్ట్‌ల కోసం ఎస్ ఇ సి ఐ టెండర్ కింద ఇవ్వబడిందని హిందూస్థాన్ పవర్ చైర్మన్ రతుల్ పూరి చెప్పారు.

రైవాడ కాలువపై రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగర ప్రజల దాహార్తి తీర్చే ప్రధాన నీటి వనరులైన రైవాడ నుండి విశాఖకు నీరు అందించే రైవాడ కాలువపై కొత్తవలస, దేవరాపల్లి రోడ్‌లో కృష్ణ రాయుడుపేట వద్ద సుమారు రూ.91 లక్షలు జీవీఎంసీ సాధారణ నిధులతో రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తితో కలిసి శంకుస్థాపన చేశామని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ఎంతో అభివృద్ధి చెందుతున్న విశాఖ నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం జలాశయాల అభివృద్ధికి ఎంతో కృషి చేయడం జరుగుతుందని, జలాశయాలలో నీటి నిలువ సామర్థ్యం పెంచి ప్రజలకు అవసరమయ్యే తాగునీరు కాలువలు, పైపుల ద్వారా నగరానికి తీసుకురావడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా జీవీఎంసీ నిధులతో కృష్ణ రాయుడుపేట వద్ద రూ.91 లక్షల రైవాడ కాలువపై రోడ్డు, కల్వర్టు నిర్మాణం చేపట్టేందుకు మాడుగుల శాసనసభ్యులు ప్రతిపాదన మేరకు శంకుస్థాపన చేశామన్నారు. అనంతరం మాడుగుల శాసనసభ్యులు మాట్లాడుతూ రైతులకు, పట్టణ ప్రజలకు ప్రాణాధారమైన జలాశయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి డ్యాములు, చెరువులు, ఆనకట్లు నిర్మించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. విశాఖ ప్రజల దాహార్తి తీర్చేందుకు రైవాడ రిజర్వాయర్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విశాఖ నగరానికి వచ్చే కాలువపై కృష్ణరాయుడిపేట వద్ద రోడ్డు, కల్వర్టులు నిర్మించేందుకు శంకుస్థాపన చేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ తాగునీటి విభాగం కార్యనిర్వహక ఇంజనీరు మురళీకృష్ణ, ఉప కార్య నిర్వాహక ఇంజనీరు, సహాయక ఇంజనీరు, దేవరపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 29 వరకు అంచనాల కమిటీ పర్యటన

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంచనాల కమిటీ ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించనుంది. 25వ తేదీ రాత్రికి విశాఖ చేరుకోనున్న కమిటీ నాలుగు రోజుల పాటు ఉత్తరాంధ్ర పరిధిలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పర్యటించి పలు అధికారిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కానుంది. 29వ తేదీ రాత్రికి శ్రీకాకుళం నుంచి నేరుగా రైలు మార్గంలో కమిటీ విజయవాడ చేరుకోనుంది. ఏపీ లెజిస్లేటివ్ సెక్రటరీ జనరల్ ఈ మేరకు షెడ్యూల్‌తో కూడిన ఓ ప్రకటన విడుదల చేశారు. ఛైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు అధ్యక్షతన కమిటీ సభ్యులైన భూమా అఖిల ప్రియ, నిమ్మక జయకృష్ణ, బండారు సత్యానందరావు, కందుల నారాయణరెడ్డి, మద్దిపాటి వెంకటరాజు, పార్థసారధి వాల్మీకి, పాసిం సునీల్ కుమార్, యేలూరి సాంబశివరావు, పెనుమత్స వి.వి. సూర్య నారాయణరాజు, వరుదు కళ్యాణిలు నాలుగు రోజుల పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించనున్నట్లు వివరించారు. పర్యటనలో భాగంగా 26వ తేదీ ఉదయం సింహాచలం లక్ష్మీనరసింహ స్వామిని దర్శనం చేసుకుంటారు. తదుపరి ఈవో కార్యాలయంలో దేవాదాయ శాఖ అధికారులతో సమావేశం అవుతారు. అనంతరం కలెక్టరేట్ కు చేరుకొని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించనున్నారు. 2019-20, 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో జరిగిన పనులకు సంబంధించిన అంశాలపై సమీక్షిస్తారు. తర్వాత నగరంలో పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించుకుంటూ విజయనగరం చేరుకుంటారు. 26వ తేదీ రాత్రికి రామనారాయణాన్ని సందర్శించి, రాత్రికి విజయనగరం ప్రభుత్వ అతిథి గృహంలో బస చేస్తారు. 27వ తేదీ ఉదయం పైడితల్లి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం కలెక్టరేట్లో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. 2019-20, 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో జరిగిన పనులకు సంబంధించిన అంశాలపై సమీక్షిస్తారు. 28వ తేదీ ఉదయం అరసవిల్లి సూర్యనారాయణ ఆలయాన్ని దర్శించుకొని పూజలు చేస్తారు. తదుపరి కలెక్టరేట్లో అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. 2019-20, 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో జరిగిన పనులకు సంబంధించిన అంశాలపై సమీక్షిస్తారు. రాత్రికి శ్రీకాకుళం నుంచే రైలు మార్గం ద్వారా బయలుదేరి విజయవాడ చేరుకుంటారు.

అనధికార భవనాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు స్వీకరణ

జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ.ప్రభాకరరావు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు నగరంలో 1985 నుండి ఆగస్టు 31, 2025 లోపు నిర్మించిన అనధికార భవనాలను క్రమబద్ధీకరణ చేయుటకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన బిపిఎస్ సదవకాశాన్ని వినియోగించుకోవాలని జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళికాధికారి ఎ.ప్రభాకరరావు మంగళవారం తెలిపారు. మహా విశాఖపట్నం నగరపాలకసంస్థ పరిధిలో గల పట్టణ ప్రణాళికా విభాగమునకు సంబంధించి, ప్రభుత్వం వారి జీవో ఎం.ఎస్.నెంబర్ 225 , తేది..12.11.2025 ప్రకారము నగర పాలక సంస్థలు/ బిల్డింగ్ క్రమబద్ధీకరణకు (బిపిఎస్) స్కీమ్ జీవోను ప్రభుత్వం విడుదల చేసిందని, అనుమతి లేకుండా నిర్మించిన బిల్డింగ్స్, ఫ్లాట్స్ కి డివియేషన్ ఉన్న బిల్డింగ్స్ ఒకేసారి రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం ప్రభుత్వము కల్పించిందని తెలిపారు. 1985 నుండి తేదీ 31-08-2025 మధ్య నిర్మించిన బిల్డింగ్స్, మున్సిపాలిటీ, కార్పొరేషన్ ,యుడిఏ, సిఆర్డీఏ, విఎంఆర్డీఏ, ఐఏఎల్ఏ పరిధిలో ఉన్నవారికి ఈ అవకాశం వర్తిస్తుందని, ప్రభుత్వ భూములు/ఎండోమెంట్స్/ సాగర్ / నది వాగు / ట్యాంక్ బెడ్, మాస్టర్ ప్లాన్ రోడ్/ ఓపెన్ స్పేస్ /పార్కు వినియోగించే భూములు, తేదీ 31-08-2025 తర్వాత కట్టిన నిర్మాణాలు, భూ వివాదం ఉన్నవాటికి అవకాశం లేదని తెలిపారు. వెబ్సైట్ www.bps.ap.gov.in ద్వారా రిజిస్టర్డ్ సేల్ డీడ్ కాపీ, ఈసీ, మార్కెట్ వాల్యూ సర్టిఫికేట్, ప్లాన్ ,బిల్డింగ్ ఫోటోలు, స్ట్రక్చర్ స్టెబిలిటీ సర్టిఫికేట్, ఇండెమ్నిటీ బాండ్ తదితర పత్రాలు అప్ లోడ్ చేయాలని, స్థలం యొక్క కొలతలు, డివియేషన్ విస్తీర్ణం, ల్యాండ్ మార్కెట్ విలువ, అలాగే బీపీఎస్ అప్లై చేయుట కొరకు రూ.10,000 ముందస్తు చెల్లింపు తప్పనిసరని తెలిపారు. తేదీ.31-12-1997 లోపల ఉన్న భవనాలకు 25%, మురికి వాడల ప్రాంతాల నిర్మాణాలకు 50% తగ్గింపు ఉంటుందని, నోటిఫికేషన్ వచ్చిన తేదీ నుంచి 120 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. అదే విధముగా ఇటీవలే ప్రభుత్వం వారి జీఓలో ఆంధ్రప్రదేశ్ ఆమోదం పొందని లేఅవుట్లు మరియు ప్లాట్ల క్రమబద్ధీకరణ నిబంధనలు, 2020 ని సవరించిందని, G.O.Ms.No.10, MA&UD (M) Dept, తేదీ 01.01.2020. కటాఫ్ తేదీని పొడిగిస్తూ, 30.06.2025కి ముందు రిజిస్టర్ చేయబడిన ప్లాట్లన్నింటినీ ఈ స్కీమ్ లో అవకాశము కల్పించిందన్నారు. తేదీ 27- 10 -2025 న విడుదల చేస్తూ చివరి అవకాశంగా తేదీ 23- 01- 2026 వరకు పొడిగిస్తూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు చేసుకునే ఆఖరి అవకాశాన్ని కల్పించడమైనదన్నారు . ఎల్ఆర్ఎస్ స్కీం లో స్వీకరించిన దరఖాస్తులను 25.04.2026 లోపు పరిష్కరించబడునని తెలియజేశారు. దరఖాస్తుదారుల నుండి దరఖాస్తులను స్వీకరించడానికి ఎల్ఆర్ఎస్ పోర్టల్ తేదీ 04.08.2025 నుండి అందుబాటులో ఉంచడమైనదని ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి తెలియజేశారు. ఇదే తుది అవకాశమని ప్రభుత్వ ఉత్తర్వులలో పేర్కొన్నారని తెలిపారు.. కావున, మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలో గల ప్రజలు, భవన నిర్మాణదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగము చేసుకోగలరని జీవీఎంసీ కమిషనర్ తరపున ఆయన తెలిపారు.

బాలలకు రాజ్యాంగ ఫలాలపై

విస్తృత అవగాహన అవసరం

శ్రమ శక్తి అవార్డ్ గ్రహీత, సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకులు వి.వి.వామనరావు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: బాలలకు రాజ్యాంగ ఫలాలపై విస్తృత అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని శ్రమశక్తి అవార్డ్ గ్రహీత, సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకులు వి.వి.వామనరావు అన్నారు. ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం, జీవిఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్‌ల సారథ్యాన బాలల హక్కుల పరిరక్షణలో రాజ్యాంగం పాత్రపై రూపొందించిన కరపత్రాలను మంగళవారం మద్దిలపాలెంలోని ఫోరం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వి.వి.వామనరావు ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి ఆయువుపట్టు రాజ్యాంగమేనని అన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర విద్యాశాఖలు ప్రైమరీ స్కూల్ పాఠ్యాంశాలలో రాజ్యాంగంపై అవగాహన పెంపొందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల్లో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌లు ఆవిర్భావం జరిగాయంటే అది కేవలం రాజ్యాంగం పుణ్యమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం ప్రతినిధి కె.ఎల్లయ్య, జి.వి.ఎం.సి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గుమ్మడి నర్సింగరావు, ట్రెజరర్ డి.పోలారావు, యూనియన్ ప్రతినిధులు ఎల్లారావు, చెల్లూరి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక అవగాహన సదస్సు

విశాలాంధ్ర - భీమిలి: ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఆధ్వర్యంలో భీమునిపట్నం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ప్రాంగణంలో మహిళలపై హింస నిర్మూలనకు అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జెర్జ్ మండల్ లీగల్ అథారిటీ చైర్మన్ సౌజన్య మాట్లాడుతూ నేటి సమాజంలో స్త్రీలు అనేక సామాజిక, ఆర్థిక, రాజకీయం, విద్యాపరంగా సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. గృహ హింసలు, స్త్రీలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు ఎక్కువవుతున్నాయన్నారు. వీటిని అరికట్టే ప్రయత్నంలో 1999 డిసెంబర్ 17వ తేదీన ఐక్యరాజ్యసమితి ఒక తీర్మానాన్ని చేసిందన్నారు. ప్రతి సంవత్సరం నవంబర్ 25న స్త్రీల హక్కుల పరిరక్షణ స్త్రీ హింస వ్యతిరేక దినముగా పాటించాలని సూచించారు. సీనియర్ అడ్వకేట్ బార్ సెక్రటరీ మంజుల మాట్లాడుతూ స్త్రీలు మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురైనట్లయితే వారి బాధలను తగ్గించుకొని వారి సమస్యలను పరిష్కరించుకోవడానికి జాతీయ మహిళా కమిషన్ మనకు అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ జాయింట్ సెక్రటరీ డి.కనకమహాలక్ష్మి, న్యాయవాదులు రాధిక కుమారి, అరుణ కుమారి, సుజాత, యమునా, ఆశా వర్కర్ మంగ వేణి తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈలను బలోపేతానికి ప్రభుత్వంతో వాల్‌మార్ట్ వృద్ధి ఎంఓయూ

విశాలాంధ్ర - విశాఖపట్నం: వాల్‌మార్ట్ వృద్ధి, దాని ప్రోగ్రామ్ భాగస్వామి 'ఐడియాస్ టు ఇంపాక్ట్ ఫౌండేషన్' ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖతో ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయు)పై సంతకం చేసింది. వాల్‌మార్ట్ వృద్ధి ద్వారా రాబోయే మూడు సంవత్సరాలలో ఉచిత శిక్షణ, వ్యక్తిగతీకరించిన మార్గదర్శకత్వంతో రాష్ట్ర ఎంఎస్ఎంఈ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఈ ఒప్పందం సహాయపడనుందని వాల్‌మార్ట్ ఇంటర్నేషనల్

సోర్సింగ్, సప్లయర్ డెవలప్మెంట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జాసన్ ఫ్రెమ్‌స్టాడ్ అన్నారు. విశాఖపట్నంలో జరిగిన సిఐఐ భాగస్వామ్య సదస్సు 2025లో జరిగిన నిర్ణయం మేరకు తాజాగా ఈ అవగాహన ఒప్పందం చేసుకున్నామన్నారు. 2028 నాటికి అదనంగా 100,000 ఎంఎస్ఎంఈలను శక్తివంతం చేయడానికి వాల్‌మార్ట్ వృద్ధి ప్రయత్నాలలో ఒక ముఖ్యమైన ముందడుగును సూచిస్తుందన్నారు. ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మాస్టర్‌క్లాస్‌లు, వర్క్‌షాప్‌లను నిర్వహించనుందని, ఫ్లిప్‌కార్ట్ మరియు వాల్‌మార్ట్ మార్కెట్‌ప్లేస్ వంటి దేశీయ, అంతర్జాతీయ ఇ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలోకి ఎంఎస్ఎంఈలు చేరటానికి, తమ వ్యవస్థలను ఆధునీకరించడానికి, వ్యాప్తి చెందటానికి మరియు విస్తరించడానికి అవసరమైన సాధనాలతో వాటిని సన్నద్ధం చేయడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

బిజెపి మోర్చా నాయకులకు మూల వెంకటరావు శుభాకాంక్షలు

విశాలాంధ్ర - పెందుర్తి: భారతీయ జనతా పార్టీ విశాఖ జిల్లా మోర్చా అధ్యక్షులుగా నియమితులైన నాయకులకు ఆ పార్టీ సీనియర్ నాయకుడు బీసీ నేత మూల వెంకట్రావు శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా షేక్ నూర్ భాషా షరీఫ్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలుగా నాదెళ్ల జ్యోతి, ఓబిసి మోర్చా అధ్యక్షుడిగా రోణంకి విజయ్ చంద్రుడు, జిల్లా కిషాన్ మోర్చా అధ్యక్షుడిగా పొట్నూరు కృష్ణారావులు నియమితులు కావడం పట్ల మూల వెంకటరావు హర్షం వ్యక్తం చేశారు. ఆయా

విభాగాల్లో అనుభవజ్ఞులైన మోర్చా అధ్యక్షులు భారతీయ జనతా పార్టీని విశాఖ జిల్లాలో అన్ని విధాల అభివృద్ధి చేయలిగే సమర్థులని ఆయన కొనియాడారు. పార్టీ పురోగతి కోసం ఎంతో కృషి చేసిన నాయకులకు అధిష్టానం ఉన్నత పదవులను అప్పగించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పివిఎన్ మాధవ్, జిల్లా పార్టీ అధ్యక్షులు పరుశురాం ఆధ్వర్యంలో విశాఖ జిల్లాలో బిజెపి ప్రగతి ప్రధాన పయనిస్తోందని, మోర్చా అధ్యక్షులు నియామకం దీనికి సంకేతమని వెంకట్రావు పేర్కొన్నారు.

నీరు, విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 స్పెషల్ క్యాంపు జీవీఎంసీ 97వ వార్డు చినముసిడివాడలో రెండో రోజు విజయవంతంగా జరిగిందని ప్రోగ్రాం ఆఫీసర్ డిఎస్ ప్రదీప్ తెలియజేశారు. నీరు, విద్యుత్ వాడకంపై విద్యార్థులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. నీరు వృధా చేయవద్దు, విద్యుత్ ఆదా చేయండి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నముసివాడ పరిసర ప్రంతాలలో ఉన్న పెద్దలు సహకరించారు. ఈ స్పెషల్ క్యాంప్‌లో రెండో రోజు విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతకు చేపట్టిన చర్యలను ఆదర్శ్ డిగ్రీ కాలేజీ కరెస్పాండంట్, సెక్రటరీ టి.థియోఫిలస్ అభినందించారు. విద్యార్థుల సేవా తత్పరతను స్థానికులు కొనియాడారు.